www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 సెప్టెంబరు 2024
5
తూర్పుగోదావరి



నేడు ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - గోపాలపురం

ఒపిఎస్‌ను అమలు చేయాలంటూ ఆదివారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేయనున్నట్టు గోపాలపురం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండేపాటి శ్రీనివాస్, సనపల రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నిరసన జరుగుతుందన్నారు. దీన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ ఏవిధంగానూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యం కావని తెలిపారు. వీటి వల్ల ఉద్యోగులకు నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఒపిఎస్‌ను సాధించే వరకు నిరసనలు నిర్వహిస్తామని తెలిపారు.

మెడికల్ మాఫియా

- విచ్చలవిడిగా షాపుల నిర్వహణ
- అర్హత లేని సిబ్బందితో నడుస్తున్న ఫార్మసీలు
- డాక్టర్ల చీటీ లేకున్నా మందుల విక్రయం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. అనుమతి లేకుండా ఫార్మసీలు నిర్వహిస్తూ ప్రజల నుంచి అందినకాడికి దోచుకుంటోంది. అనుమతి ఉన్న మెడికల్ షాపుల్లో అర్హతలేని సిబ్బందిని నియమించి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో అధికారికంగా 940 మెడికల్ షాపులు ఉన్నాయి. అనధికారికంగా మరో 100కి పైగా షాపులు జరుగుతున్నాయి. మొత్తం షాపుల్లో నెలకు కోట్లాది రూపాయాలకు పైగా విలువైన మందులను విక్రయాలు జరుగుతున్నాయి. అత్యధిక వ్యాపారం రాజమహేంద్రవరంలో జరుగుతుంది. చుట్టు పక్కల మండలాల నుంచి వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఆసుపత్రులను ఆశ్రయించడం పరిపాటి. వైద్యుల సూచన అనంతరం మందులు ఇక్కడే కొనుగోలు చేసి వెళ్తుంటారు. అనుమతి లేకుండా షాపులు నిర్వహిస్తూ విక్రయించిన మందులకు సైతం బిల్లులు ఇవ్వకుండా ప్రజల జేబులకు చిల్లువేస్తున్నారు. కొన్నిచోట్ల డాక్టర్ల చీటి లేకుండానే మందులు అమ్ముతున్నారు.



అనధికార షాపులపై చర్యలేవి..?

జిల్లా వ్యాప్తంగా 1040 వరకూ మెడికల్ షాపులు ఉన్నాయి. ప్రధానంగా రాజమహేంద్రవరంలోనే 500 రిటైల్ షాపులు, 200 హోల్‌సేల్ షాపులు నడుస్తున్నాయి. చాలా మెడికల్ షాపుల్లో అర్హత గల సిబ్బంది లేరనేది బహిరంగ రహస్యమే. ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన అర్హత గల వారి పేర్లపై షాపులకు అనుమతి తీసుకొని అర్హతలేని సిబ్బంది ద్వారా మందులను ప్రజలకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారిక షాపులలో సైతం చాలా వరకు అర్హతలేని సిబ్బందే మందులు విక్రయిస్తున్నారు. ప్రధాన మెడిసిన్‌లకు సంబంధించి సిబ్బందికి ప్రజలకు ఎలా విక్రయించాలో ముందే చెబుతున్నారు. దీంతో ప్రజలు ఆ మందులు వేసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు.

డాక్టర్ల చీటీ లేకుండానే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం డాక్ట ర్ రాసి ఇచ్చిన మందుల చీటీ(మెడిసిన్ ప్రిస్కిప్షన్) ఆధారంగానే మందులను వినియోగదారునికి విక్రయించాల్సి ఉంటుంది. కానీ, జిల్లాలోని కొన్ని మెడికల్ షాపుల్లో ఇష్టారీతిన మందుల విక్రయం జరుగుతున్నాయి. డాక్టర్లు రాసిన మందులను ఇవ్వాల్సింది పోయి తమకు తోచిన మందులను రోగులకు ఇస్తూ వారి జీవితాలతో కొందరు షాపుల నిర్వాహకులు ఆడుకుంటున్నారు. విక్రయించిన ప్రతి డ్రగ్‌కు బిల్లు ఇవ్వాల్సి ఉండగా లేకుండానే అమ్మేస్తున్నారు. మరో వైపు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు మందులు అమ్ముతున్నట్లు ఆరోపణలున్నాయి. బీపీ, షుగర్ వంటి వ్యాధులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు మందులు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. డ్రగ్ కంట్రోలర్ అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి అనధికార వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నాము. ప్రతి నెలా 50 షాపులను తనిఖీలు చేస్తున్నాము. గత నెలలో నిబంధనలు అతిక్రమించిన రెండు షాపులపై చర్యలకు ఆదేశించాము. ఫార్మసిస్టుల పర్యవేక్షణలోనే మెడికల్ షాపుల నిర్వహణ జరుగుతుంది. కొన్ని మందులకు మాత్రమే డాక్టర్ ప్రిస్కిప్షన్ మినహాయింపు ఉంది. మెడికల్ షాపుల నిర్వహణలోనిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

- ఎ.కృష్ణ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజమహేంద్రవరం

జోరు వాన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా శనివారం జోరువాన కురిసింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. రహదారులపైకి వర్షపు నీరు నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకూ వర్షం పడుతూనే ఉంది. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరంలో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది.



తాళ్లపూడి ఏటిగట్టుపై కూలిన వృక్షాన్ని తొలగిస్తున్న స్థానికులు

తాళ్లపూడి మండలంలో భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక రోడ్లన్నీ జలమయమయ్యాయి. తాళ్లపూడి ఏటిగట్టుపై చెట్టు కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు దానిని తొలగించారు. ముందు జాగ్రత్తగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. తాళ్లపూడి మెయిన్ బజార్ వర్షపు నీటితో నిండిపోతున్నాయి. గోపాలపురంలో కురిసిన వర్షానికి రహదారులు నీట మునిగాయి. రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి.

రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరంలో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. ధవళేశ్వరంలోని ఇరిగేషన్ కార్యాలయాల వద్ద నీరు నిలిచిపోయింది. లాకులైను ప్రాంతంలోని మురుగునీటితో వర్షపు నీరు కలిసిపోవడంతో పారిశుధ్యం క్షీణించింది. లక్ష్మీజనార్దనస్వామి కాలనీలో వర్షానికి ఛిద్రంగా మారింది. కాలనీలోకి వెళ్లే రహదారి మురుగు, వర్షపు నీటితో నిండిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 56.4 మిల్లీమీటర్ల వర్షపాతం

సగటున 56.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెరవలి మండలంలో అత్యధికంగా 97 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా గోకవరం మండలంలో 36 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నల్లజర్లలో 70.8, ఉండ్రాజవరంలో 67.2, అనపర్తిలో 66.4, బిక్కవోలులో 64.8, రంగంపేటలో 63.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. తాళ్లపూడిలో 62.6, రాజానగరంలో 58.8, కడియంలో 55.2, గోకవరంలో 53.2, రాజమహేంద్రవరం రూరల్‌లో 53.2, నిడదవోలులో 52.4, దేవరపల్లిలో 51, రాజమండ్రిసిటీలో 49.4 ఎంఎం, గోపాలపురంలో 46.6, చాగల్లులో 45.2, కొవ్వూరులో 41.6, సీతానగరంలో 36.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రైల్వే బాక్స్‌బాయ్స్ తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రైల్వేలో 25 ఏళ్లుగా పనిచేస్తున్న రైల్వే బాక్స్ బాయ్స్‌ను తొలగించడం అన్యాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమారాజు అన్నారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాజమండ్రి శాఖ సమావేశం రాజమండ్రి బాక్స్ బాయ్స్ రూమ్‌లో వై.సత్తిబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో పూర్ణిమరాజు పాల్గొని మాట్లాడారు. 25ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించడం దారుణమన్నారు. వెంటనే వారిని పనుల్లోకి తీసుకోవాలని లేదా వెంటనే వేరే పని కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే ప్రయివేటీకరణ విధానాల్లో భాగంగా ఇలాంటి విధానాలను అవలంబిస్తుందన్నారు. రైల్వే గార్డ్స్, లోకో పైలట్‌ల బాక్స్ లోడింగ్, అన్ లోడింగ్ చేసే బాక్స్ బాయ్స్ విధానాన్ని తొలగించి ట్రాలీ బ్యాగ్స్‌ను గార్డ్స్‌కు, లోకో పైలెట్స్‌కు ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తగదన్నారు. దీని వల్ల 25 ఏళ్లుగా ఇదే పనిపై బతుకుతున్న బాక్స్ బాయ్స్ కుటుంబాలు వీధిన పడతాయన్నారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు. లేదా వేరే పని కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమిస్తాని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాజమండ్రి శాఖ కార్యదర్శి బి.శ్రీనివాస్, బాక్స్ బాయ్స్ సీనియర్ కార్మికులు వి.నాగేశ్వరరావు, బి.సోమరాజు, ఎస్.సుదర్శనరావు, సిహెచ్.కృష్ణ, కె.సురేష్, కె.నాగరాజు, బి.అప్పారావు, పి.శ్రీనివాసరావు, బి.దుర్గారావు, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నినదిస్తున్న బాక్స్‌బాయ్స్

మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణంలో గణపతి సెంటర్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు మున్సిపల్ అధికారులను శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల మున్సిపాలిటీ సిబ్బంది నగరం సుందరీకరణ పేరుతో గణపతి సెంటర్లో అనేక ఏళ్ల నుంచి మున్సిపల్ స్థలంలో నివాసం ఉంటున్నవారిని ఖాళీ చేయించి మాస్టర్ ప్లాన్ అమలు చేశారన్నారు. దీనికి అందరూ సహకరించారన్నారు. ఒక వైపు ఆర్‌ఒబి నిర్మాణం వల్ల గూడెం గేట్ నుంచి బస్టాండ్ మార్కెట్, అంబేద్కర్ చౌక్, ప్రభుత్వ ఆసుపత్రి వైపు ట్రాఫిక్‌ను మళ్లించడంతో రోడ్లు ధ్వంసమయ్యాయన్నారు. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడు ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇటీవల భార్య భర్తలు బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. తక్షణమే మాస్టర్ ప్లాన్ అమలు చేసి రోడ్డును విస్తరించాలన్నారు. దీనిపై కౌన్సిల్‌లో చర్చించాలని పేర్కొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ తదితరులు

13 నుంచి మేధ ఉత్సవాలు

ప్రజాశక్తి - రాజానగరం

గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి మేధ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్.శర్మ తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల పోస్టర్‌ను ఆయన శనివారం జిజియులో ఆవిష్కరించారు. అనంతరం రిజిస్ట్రార్ శర్మ మాట్లాడారు. ఈ ఉత్సవాల్లో భాగంగా పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్ పో, ఇంట్రాక్టివ్ వెబ్ డిజైన్, రోబో రేస్, టెక్నికల్ క్విజ్, టెక్నికల్ టాక్స్, ఫిలిం మేకింగ్, ట్రజర్ హంట్‌తో బాటు స్పాట్ ఈవెంట్స్ కూడా ఉంటాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలవారు www.ggu.edu.in/medha లేదా https://ggu-medha-2024-netlify.appలో సెప్టెంబర్ 10లోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రావు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయానందకుమార్, గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవిఎస్.బాబు, గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పిజి.రామానుజం, గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వల్లిమాధవి, గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామచంద్రన్, జిజియు డీన్ డాక్టర్ ఎన్.లీలావతి, మేధ కన్వీనర్లు డాక్టర్ బి.సుజాత, డాక్టర్ ఆర్.తమిళ కోడి పాల్గొన్నారు.

తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పింఛన్ల పంపిణీని శనివారం తెల్లవారుజాము నుంచే పంపిణీ చేశారు. వర్షం వస్తున్నప్పటికీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.

ఉండ్రాజవరం : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం కె.సావరంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందించారు. లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన మొదటి నెలలోనే పెంచిన పింఛన్ల సొమ్మును అందించిందన్నారు. పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు అవ్వడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నార్ని రామకృష్ణ, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, కూటమి నాయకులుపాల్గొన్నారు.

చాగల్లు : ఆదివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ 96 శాతం పూర్తి అయ్యిందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.నిర్మలకుమారి తెలిపారు. మండలంలో మొత్తం 9,415 మందికి 8,970 మందికి పింఛన్లు అందించామన్నారు. గ్రామ సచివాలయం-3 పరిధిలోని కొడమంచిలి మంగమ్మ, అడుసుమల్లి నాగేశ్వరావు అనారోగ్య కారణంగా రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారరు. సర్వేయర్ వై.శిరీష, ఎఎన్ఎం జె.సీతామహాలక్ష్మి ఆసుపత్రికి వెళ్లి వారికి పింఛను అందించారు. ఉదయం నాలుగు గంటలు నుంచే వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సిబ్బంది పింఛన్లను పంపిణీ చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.నిర్మలకుమారి, తహాశీల్దార్ ఎం.మెరికమ్మ, విస్తరణ అధికారి ఎం.శ్రవణ్‌కుమార్, ఎంపిఎం మంగాయమ్మ పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.



పెరవలి మండలం ఖండవల్లిలో పింఛను అందిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి : మండలంలోని ఖండవల్లి గ్రామంలో మంత్రి దుర్గేష్ చేతులు మీదుగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా లో 2,39,924 మందికి రూ.102.31 కోట్ల పింఛను అందించామన్నారు. ఎన్నడూ లేని విధంగా ఒక రోజు ముందుగానే పింఛను అందించామన్నారు. పెరవలి మండలంలో 10,371 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిడదవోలు నియోజకవర్గంలో రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందులు దుర్గేష్ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ రవివర్మ, కూటమని నాయకులు అతికాల శ్రీను, పిప్పర రవికుమార్, తహాశీల్దార్ డి.అచ్యుతకుమారి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ నాయకులు అధికారులు పాల్గొన్నారు

తాళ్లపూడి : మండలంలో అధికారులు, కూటమి నాయకులు తెల్లవారాజాము ఐదు గంటల నుంచి వర్షంలోనే పింఛన్లు పంపిణీ చేశారు. మండల ప్రత్యేక అధికారి డిపిఒ రాంబాబు తెల్లవారుజామునే మలకపల్లి గ్రామంలో పింఛన్లు పంపిణీలో పాల్గొన్నారు. మండలంలో 7,518 మందికి పింఛన్లు అందించారు. 96 శాతం పంపిణీ పూర్తి చేశామని ఎంపిడిఒ రమణ తెలిపారు. రెవెన్యూ కార్యాలయం ఎఎస్ఒ వెంకటేశ్వరరావు, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు

గోకవరం : మండలంలో గుమ్మలదొడ్డి గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను తెల్లవారుజామునే పంపిణీ చేశారు. మండలం స్పెషల్ ఆఫీసర్ ముఖలింగం చేతుల మీదుగా, టిడిపి నాయకులు, తూర్పుగోదావరి జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.చిన్ని, తొమ్మిదవ వార్డు గంటి వెంకటేష్ ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ మట్టాడి దుర్గాకుమార్, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి పింఛను మంజూరు

గోకవరం : కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న గోకవరం ఆంజనేయస్వామి గుడి వీధి 16వ వార్డుకు చెందిన రెడ్డి జయలక్ష్మికి రూ.10వేల పింఛను మంజూరైంది. కిడ్నీ సమస్యతో బాధపడుతు డయాలసిస్ చేయించుకోవడం కోసం ఆమె ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటుంది. స్థానిక నాయకులు ఈ విషయాన్ని ఎంఎల్ఎ జ్యోతుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి పింఛను అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ జ్యోతులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. పులపర్తి బుజ్జి, చింతల రామకృష్ణ, సిహెచ్.గోపీనాథ్‌గుప్త, సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో ఆమెకు పింఛను అందించారు.

త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

రాజమహేంద్రవరం : స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి డి.నరసింహకిషోర్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావు ఆయనకు స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. నమోదైన గ్రేవ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం కేసులకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్లలోగల సిసి కెమెరాలను పరిశీలించి వాటి పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గ్రేవ్ కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. మద్యం, గంజాయి, నాటుసారా అక్రమ రవాణను నియంత్రించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ మరియు రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. సిబ్బందితో ముఖాముఖీ మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసుల సూచనలు పాటించాలి

ఉండ్రాజవరం : వినాయక చవితి విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీలు అన్ని శాఖల అనుమతులు తప్పనిసరిగా పొందాలని, పోలీసుల సూచనలు పాటించాలని ఎస్ఐ జి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులను సులభతరం చేయడానికి ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని సిద్ధం చేస్తోందన్నారు. ఎదుటి వారికి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల షరతులు పాటించాలన్నారు. మండపాల వద్ద తాత్కాలిక సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ప్రహరీని వెంటనే నిర్మించాలి

నిడదవోలు : మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రహరీని వెంటనే నిర్మించాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా నిడదవోలు మహిళా జూనియర్, డిగ్రీ కాలేజీలను స్ట్రాంగ్‌రూమ్‌లుగా ఉపయోగించారన్నారు. ఆ సందర్భంగా ఎన్నికల సామగ్రి, ఇతర సామగ్రి తరలింపు కోసం బాయ్స్ హైస్కూల్, జూనియర్ కాలేజీ, మహిళా కాలేజీల మధ్య సరిహద్దుగా ఉండే ప్రకరీని పడగొట్టారన్నారు. ఎన్నికలు ముగిసినా దానిని నిర్మించకుండా వదిలేశారు. వెంటనే ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రహరీ లేకపోవడం వల్ల మహిళా కళాశాలలకు భద్రత కరువైందన్నారు. లేకుంటే విద్యార్థులను సమీకరించి ఆందోళన చేస్తామని రాంబాబు హెచ్చరించారు.

'ఇన్‌స్పైర్' నామినేషన్లు పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం : 2024 -25 సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్ విజన శాస్త్ర ప్రదర్శనకు నామినేషన్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు హెచ్‌ఎంలను ఆదేశించారు. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, రెసిడెన్షియల్, ఆదర్శ, కస్తూర్బా, కేంద్రీయ, నవోదయ, ప్రయివేటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, సైన్ ఉపధ్యాయులు దీనిపై దృష్టి పెట్టాలన్నారు. నామినేషన్లను సబ్‌మిట్ చేసేందుకు చివరి తేదీ సెప్టెంబర్ 15 అని తెలిపారు. అప్పటి వరకూ వేచి చూడకుండా నామినేషన్ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఉన్నత పాఠశాలల నుంచి 6, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 3 ప్రాజెక్టులు విధిగా సబ్‌మిట్ చేయాలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ జివిఎన్ఎస్.నెహ్రూ (9490351351) నెంబర్‌ను సంప్రదించాలన్నారు .

నిలిచిపోయిన ఆర్‌టిసి బస్సు


దేవరపల్లి : దేవరపల్లి మండలం యర్నగూడెం గండిచెరువు వద్ద ఉదయం ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. ఫ్యాన్ బెల్ట్ అకస్మాత్తుగా తెగిపోవడంతో వెంటనే స్టీరింగ్ లాక్ అవడంతో బస్ రోడ్‌పై అక్కడికక్కడే నిలిచిపోయింది. డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది

తటవర్తి కుటుంబానికి మంత్రి దుర్గేష్ పరామర్శ

ప్రజాశక్తి- కడియం

అనారోగ్యంతో మతి చెందిన దుళ్ల ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు తటవర్తి వీర్రాజు కుటుంబాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం పరామర్శించారు. శనివారం కడియం మండలం దుళ్ల లో వీర్రాజు కుమారులు ఏసు, రాము, రాజా లను పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ని తెలిపారు. తొలుత వీర్రాజు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.. పరామర్శించిన వారిలో రాష్ట్ర జనసేన కార్యదర్శి రత్నం అయ్యప్ప, స్థానిక కూటమి నాయకులు సూరపురెడ్డి భరత్, తూము శ్రీను, మెర్ల అయ్యప్ప, గుర్రపు కొండయ్య మాష్టారు, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, ఈదర నందబ్బు, కంటిపూడి శ్రీనివాస్, చిక్కాల రాముడు, కులపాకుల సత్తిబాబు, దూడల సత్తిబాబు తదితరులు ఉన్నారు..

కార్టూ'నిజం'



లేపాక్షిలో హస్తకళలు, వస్త్రాల ప్రదర్శన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ లేపాక్షి హస్తకళల ఎంపోరియం ద్వారా గాంధీ శిల్ప బజార్ పేరిట ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభించింది. సెప్టెంబర్ 5వ తేదీ వరకు వారం రోజులపాటు నిర్వహించే ఈ గాంధీ శిల్ప బజార్ ఎగ్జిబిషన్ శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో కలెక్టర్ పి.ప్రశాంతి, సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాసు శనివారం ప్రారంభించారు. హస్తకళలను ప్రోత్సహించి ఆదరించాలని వారు సూచించారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి అనుగుణంగా ఇక్కడ ప్రదర్శన ఏర్పాటుకావడం అభినందనీయమని ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు అన్నారు. విసి అండ్ ఎమ్‌డి ఎం.బాలసుబ్రహ్మణ్యంరెడ్డి అతిథులులకు స్వాగతం పలికారు. కేంద్ర టెక్స్ టైల్స్ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనలో భారతదేశం నలుమూలల నుండి దాదాపు 50 మంది హస్తకళాకారులు పాల్గొని, వివిధ రకాల హస్తకళలు, చేనేత ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు. కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, చెక్కబొమ్మలు, తోలు బొమ్మలు, మచిలీపట్నం నుంచి కృత్రిమ ఆభరణాలు, మదనపల్లి నుంచి కుండలు, ఏలూరు నుంచి తివాచీలు, నర్సాపూర్ జరీ వస్తువులు, మచిలీపట్నం, వెంకటగిరి, మంగళగిరి నుంచి కలంకారి బ్లాక్ ప్రింట్లు ఉంటాయి. ఉప్పాడ చీరలు, బీహార్ నుంచి బగల్పూర్ సిల్క్, మధ్య ప్రదేశ్ నుంచి కోసా చీరలు, కాశ్మీరీ సిల్క్, బెంగాల్ కాటన్ చీరలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ప్రదర్శన ఉంటుందన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసు, కలెక్టర్ ప్రశాంతి

వైద్య శిబిరాల ఏర్పాటు

ఉండ్రాజవరం : ఫీవర్ సర్వేలో భాగంగా ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనపి ఆర్‌కె.కాలనీ, వేలివెన్ను పిహెచ్‌సి పరిధిలోని వేలివెన్ను, ఆరోగ్య కేంద్రం-1లలో శనివారం మెడికల్ క్యాంపులు నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ ఆర్.ఉషాదేవి, డాక్టర్ వై.సృజన రోగులను పరీక్షించి మందులు అందించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనారోగానికి గురైలే వెంటనే వైద్యులు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఎంపిహెచ్ఇఒ షేక్‌ఖాన్, ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసు, సూపవైజర్ కెకె.సుభాషిణి, మహిళా ఆరోగ్య కర్త ఆర్.సత్యవతి, ఎంఎల్‌హెచ్‌పి సాయి, విజయలక్ష్మి, ఎఎన్ఎం కె.సునీత పాల్గొన్నారు.

185 మందికి వైద్య పరీక్షలు

చాగల్లు : చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 185 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కె.నిషిత ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులను నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతన్న 124 మందిని గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించి వైద్యం అందించామని డాక్టర్ పిఆర్ఎల్.దేవి తెలిపారు.

పిహెచ్‌సిని సందర్శించిన ఎంఎల్ఎ

బ్రాహ్మణగూడెం పిహెచ్‌సిని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సందర్శించారు. ఆసుపత్రికి భవనం ఏర్పాటు చేయాలని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన దీనిపై సానుకూలంగా స్పందించారు. గ్రామ పెద్దలు స్థలం ఇప్పించ గలిగితే వెంటనే అనుమతులు తీసుకొస్తామన్నారు.

వానలు.. వ్యాధులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాను ఒక పక్క వానలు... మరోపక్క వ్యాధులు కుదిపేస్తున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో దోమలు విజృంభించటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యాధులు పంజా విసురుతున్నాయి. వారం రోజులుగా ప్రభుత్వ ఆస్పత్రులు రోగులతో కిట కిటలాడుతున్నాయి. పల్లెల్లో వైద్య సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవటంతో రోగులు ప్రయివేటు వైదులను ఆశ్రయిస్తున్నారు. దీంతో రక రకాల పరీక్షల పేరుతో ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం జ్వరాల నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించట్లేదు. ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని చెబుతున్నా. చాలా గ్రామాల్లో వైద్య సిబ్బంది ఎవరూ రాలేదని చెబుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లోని ధవళేశ్వరంలోని వార్ఫ్, లాకులైను ప్రాంతాల్లో నేటికీ సర్వే జరుగలేదు. అక్కడ పారిశుధ్యం లోపించడంతో మలేరియా కేసులు వెలుగుచూశాయి. అయితే బాధితులు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించడంతో వీటిని లెక్కలోకి తీసుకోవట్లేదు. గ్రామంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. పదిరోజులు క్రితం ఎంఎల్‌ఎ, కలెక్టర్ పర్యటించారు. ఆ రెండు రోజులు హడావుడి తప్ప ప్రస్తుతం ఎక్కడా పనులు మాత్రం జరగట్లేదు. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

దిగిరానంటున్న ధరలు

నిత్యావసర సరుకుల ధరలు కిందకు దిగనంటున్నాయి. బియ్యం ధరలకు రెక్కలొచ్చిన విషయం విధితమే. సన్నరకం కేజీ బియ్యం కొనుగోలు చేయాలంటే రూ.60 పై మాటే. ఉల్లిపాయలు ఇప్పటికే కొండెక్కాయి. పప్పులు, ఇతర అపరాల ధరలూ డబుల్ సెంచరీలకు దగ్గరలో ఉన్నాయి. అల్లం, వెల్లుల్లి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు పెరిగిపోయాయి. తాజాగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కూరగాయల ధరలు మళ్లీ ఆకాశాన్నంటే పరిస్థితులు లేకపోలేదని వ్యాపారులు చెబుతున్నారు. మరో వైపు ప్రజా పంపిణీ ద్వారా ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే ఇప్పటి వరకూ అందించింది. ఈ నెల పంచదార పంపిణీ చేస్తామని చెబుతోంది. అయితే దీని అమలు చూడాలి. గతంలో 11 రకాల నిత్యావసర సరుకులు అందజేసిన విషయం విధితమే. ప్రస్తుతం ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లోజర్ పనులు లేక ఆందోళన

పంట కాల్వల ఆధునికీకరణ పనులను ప్రభుత్వం అటకెక్కించటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వారిలో ఆందోళన మరింత



పెరిగింది. గుర్రపు డెక్క తొలగింపు పనులకు నిధులు కేటాయించినా నతత్తనడకన పనులు సాగుతున్నాయి. జిల్లాలో 5.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది జూన్1న సాగు నీరు విడుదల చేశారు. శివారు భూములకు నీరు రాకపోవడంతో జూన్ నెలాఖరు నాటికి రైతులు సాగు ప్రారంభించే అవకాశాలు సన్నగిల్లాయి. పంట కాలువల ఆధునికీకరణ, మీడియం, మైనర్, మేజర్ డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో భారీ వర్షాలు, వరదలు వస్తే అన్నదాతకు కష్టాలు తప్పేలా లేవు.

ముసురు ముంపు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ఫలితంగా జిల్లా వ్యాప్తంగా వారాంతంలో వర్షాలు జోరుగా కురిశాయి. దీంతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మరోవైపు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోదావరి నదికి వరద నీరు క్రమ క్రమంగా చేరుతోంది. దీంతో పరివాహక ప్రాంత ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో ప్రయాణికులపై దాడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పిల్లంక పంచాయతీ గోపులంక కొత్త కొంపలు ప్రాంతంలో ముగ్గురు యువకులు శనివారం మద్యం మత్తులో ప్రయాణికులపై దాడి చేసి గాయపరిచారని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. గోపులంక డీలర్ మండ రామసుబ్రహ్మణ్యం మహేశ్వరరావు గ్రామం నుంచి యానాం వెళ్తుండగా కొత్త కొంపలు వద్ద దారికి అడ్డుగా ఉన్న యువకులను పక్కకు తప్పుకోమన్నారు. అయితే మద్యం మత్తులో ఉన్న యువకులు మహేశ్వరరావుపై దాడి చేశారు. అదే సమయంలో యానాం సినిమాకు వెళ్తున్న మహేశ్వరరావు, ఆయన కుమారులు సంతోష్, కృష్ణ వారిని వారించడానికి ప్రయత్నించారు. దీంతో వారిపై బీరు సీసా పగలగొట్టి దాడి చేశారు. అదే సమయంలో రహదారిపై వెళ్తున్న మరో ప్రయాణికుడు పితాని శ్రీరాములు తల పైన బీరు బాటిల్‌తో కొట్టడంతో అతనికి తలపై తీవ్ర గాయం అయింది. మరో నలుగురు ప్రయాణికులపైన మద్యం మత్తులో ఉన్న యువకులు దాడి చేశారు. ఈ దాడిలో తన రెండు బంగారు గొలుసులను మద్యం సేవించిన యువకులు లాక్కున్నారని మహేశ్వరరావు విలేకరులకు తెలిపారు. ఒక బంగారు గొలుసు యువకుల జేబు నుంచి స్థానికులు గుర్తించి ఇచ్చారని, ఇంకొక బంగారు గొలుసు దొరకలేదన్నారు. తన మొబైల్ ఫోను నేలకేసి కొట్టడం వల్ల పగిలిపోయిందని మహేశ్వరావు అన్నారు. దాడికి పాల్పడిన యానాం జిఎంసి బాలయోగి నగర్‌కు చెందిన యువకులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఇద్దరు మైనర్లని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి - సామర్లకోట

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఎస్ఐ పివిఎన్.మూర్తి తెలిపారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులను కాకినాడ జిల్లా కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిలో ఇద్దరికి రూ.10 వేలు చొప్పున జరిమానా, ఒక వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి - కోటనందూరు

ఆటో డ్రైవర్లు నిబంధన పాటించకపోతే చర్యలు తప్పవని సిఐ ఎం.గీతా రామకృష్ణ అన్నారు. శనివారం తుని పట్టణంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. స్కూళ్లు, కళాశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు యూనిఫారం లేకుండా నిర్లక్ష్యంగా ఆటో నడుపుతున్న డ్రైవర్‌కు ఫైన్ వేశారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకెళ్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోరంగి అభయారణ్యంలో ట్రైనీ అధికారులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ అకాడమీ ద్వారా రాజమహేంద్రవరంలో శిక్షణ పొందుతున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారులు శనివారం కోరంగి అభయారణ్యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డివిజనల్ ఫారెస్ట్ అధికారి అనూష, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ మడ అడవుల ప్రాముఖ్యతను, హోప్ ఐలాండ్ యొక్క విశిష్టత, మడ జాతికి చెందిన వివిధ రకాల మొక్కలు, జంతువుల గురించి వివరించారు. సముద్ర తాబేల్లు సంరక్షణ, మడ అడవులలో నాటు సారా అరికట్టే విధానం వివరించారు. మడ జాతికి చెందిన మొక్కల పేర్లను తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఎవి.రమణమూర్తి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాటిఫికేషన్ అంశాలపై కౌన్సిల్ అభ్యంతరం

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాల్ నందు వైస్ ఛైర్పర్సన్ పి.జ్యోతి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ర్యాటిఫికేషన్ అంశాలపై కౌన్సిల్ అభ్యంతర వ్యక్తం చేసింది. తొలుతగా మాజీ కౌన్సిలర్ సారా మీరయ్య మృతికి కౌన్సిలర్లు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. సమస్యల ప్రస్తావన లేకుండా అధికారుల మధ్య కొట్లాటతో వాడి వేడిగా సమావేశం సాగింది. 105 అంశాలు చర్చకు రాగా ఆమోదం పొందకుండా ఉన్న పనులను ర్యాటిఫికేషన్ ద్వారా శంకుస్థాపనలు చేసి పనులు చేస్తున్నారని, అటువంటపుడు కౌన్సిలర్లు దేనికి అని పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. ఏజెండాలో పేర్కొన్న ర్యాటిఫికేషన్ పనులన్నింటిని నిలిపి వేయడానికి ఆమోదం తెలిపారు.

గండేపల్లిలో అన్నదానం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుని ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని జాతీయ రహదారి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

2న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజులు పురస్కరించుకుని సెప్టెంబర్ 2న పి.మల్లవరంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు విఆర్ఎన్‌బి.ప్రసాద్ తెలిపారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నిర్వహణలో ఉదయం 8 గంగల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే ఈ శిబిరంలో పవన్ కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

శృంగార వల్లభ స్వామిని దర్శించుకున్న ఎంఎల్‌సి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభ స్వామిని ఎంఎల్‌సి పి.హరిప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయనకు ప్రసాదాలు, స్వామి ఫోటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ జలమయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో భారీగా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. వ్యాపార సముదాయాలు మూతబడ్డాయి. చేనేత మగ్గాల వద్ద చమాయింపు రావడంతో మగ్గాలకు బ్రేకులు పడ్డాయి.

మెకానికల్ విభాగంలో అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 3, 5 సెమిస్టర్ విద్యార్థులు కొరకు అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సదస్సులో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ యూనివర్సిటీ మెకానికల్ ప్రొఫెసర్. పి.వి.మణివణ్ణన్ పాల్గొని 'ఎలక్ట్రిక్ అండ్ హైబ్రిడ్ వెహికల్స్ టెక్నాలజీ' అనే అంశంపై విశదీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు ఉదాహరణలతో నివృత్తి చేశారు. యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తరచు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు నూతన టెక్నాలజీని అందివ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.శరవణన్, డాక్టర్ బిహెచ్.వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

లయన్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - యానాం

స్థానిక గాజుల వారి వీధిలో ఉన్న పార్వతీశ్వరమ్మ మినీ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ చేసిన సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్‌కి త్వరలో శాశ్వతంగా ఉండటానికి భవనం నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా గవర్నర్ డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షతన వేలూరు సూర్యనారాయణ (మాజీ డిస్టిక్ గవర్నర్) ఆధ్వర్యంలో క్లబ్ నూతన అధ్యక్షుడిగా డివివి.సత్యనారాయణ, సెక్రెటరీగా నల్లాం సురేష్, ట్రెజరీ కనకాల నరసింహమూర్తి, వైస్ ప్రెసిడెంట్స్‌గా బెజవాడ నిరంజన్, గొల్లపల్లి వీర్రాజు, ఛైర్పర్సన్ పులవర్తి వెంకట రమణమూర్తి, మెంబర్ షిప్ ఆఫ్ ఛైర్పర్సన్‌గా చింతపూడి సత్యనారాయణ, మార్కెటింగ్ ఛైర్పర్సన్‌గా ఆరిశెట్టి రాజేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి - యానాం

మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు పుదుచ్చేరి సహకారశాఖ ది యానాం కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నిక ఈ నెల 21న నిర్వహించారు. ఈ నేపథ్యంలో కో-ఆపరేటివ్ నూతన కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవం అయింది. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్యానెల్ నుంచి ఎక్కువమంది డైరెక్టర్లు ఎన్నికవ్వడంతో శనివారం తన స్వగృహంలో సమావేశం నిర్వహించి కమిటీని ఏకగ్రీవం చేశారు. కో-ఆపరేటివ్ స్టోర్స్ ప్రెసిడెంట్‌గా లంక విద్యాసాగర్, వైస్ ప్రెసిడెంట్‌గా కమిడి విజయకుమార్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడారు. అనంతరం ఎన్నికైన వారిని మల్లాడి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు, మున్సిపల్స్ మాజీ వైస్ ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాడి సామ్యూల్ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన దరియాలతిప్ప రైతులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను తన స్వగృహంలో దరియాలతిప్ప ఫీల్డ్ లేబర్ సొసైటీ రైతులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు వివరించారు. వరద తాకిడితో పంట పొలాలు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని, అందుచేత పంట పొలాల చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని, సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఒఎన్‌జిసి అధికారులతో మాట్లాడి రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి, కోరుకొండ ఆనందరావు, రాంబాబు, సబ్బతి లోకేశ్వరావు పాల్గొన్నారు.

ముగిసిన ఎపిఎస్ఎస్‌డిసి ప్రోగ్రాం

ప్రజాశక్తి - గండేపల్లి

ఎపి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరిగిన ఐదు రోజుల శిక్షణ శనివారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో పలు సూచనలు, సలహాలను ఉపాధ్యాయులు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి ఎస్.వరప్రసాద్, డీన్ అకడమిక్స్ డాక్టర్ పుల్లెల రవికుమార్, డీన్ ఆర్ అండ్ డి డాక్టర్ సిహెచ్‌వి.రాఘవేంద్ర, విభాగాధిపతి డాక్టర్ జిఎస్ఎన్.మూర్తి, వర్క్ షాప్ కో ఆర్డినేటర్ డివి.రవికుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.97.40 వేల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.97.40 ఆదాయం సమకూరిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.29,910, అన్నదాన విరాళాల ద్వారా రూ.53,578, కేశఖండన ద్వారా రూ.5,840, తులాభారం ద్వారా రూ.250, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.7,875 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణార్యులు, సిబ్బంది సేవలందించారు.



అన్నదానం చేస్తున్న ఆలయ సిబ్బంది

డివిజన్లో 97.2 ఎంఎం వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 97.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయిందని ఆర్‌డిఒ జె.సీతారామారావు ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దాపురంలో 12.8, గండేపల్లిలో 8.2, తొండంగిలో 6.4, ప్రత్తిపాడులో 7.4, కిర్లంపూడిలో 6.8, జగ్గంపేటలో 2.4, ఏలేశ్వరంలో 18.2, శంఖవరంలో 11.8, రౌతులపూడిలో 2.6, తునిలో 10.0, కోటనందూరులో 11.2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదయిందని తెలిపారు.

ప్రమాదకరంగా రహదారులు


ప్రజాశక్తి - తాళ్లరేవు

అసలే వర్షాకాలం దానికి తోడు రహదారులు గోతులమయం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై నిరంతరం పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మారిన రహదారుల తీరు మారలేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి. మల్లవరం, పోలేకుర్రు పంచాయితీల సరిహద్దు ప్రాంతంలో రహదారి మధ్యలో పెద్ద పెద్ద గుంతలు పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతం నుంచి పి. మల్లవరం పంచాయతీ మెయిన్ రోడ్డు వరకు రహదారి గుంతలు పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఈ గుంతలు పూడ్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్నానఘట్టం వద్ద గరుడ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి లో బాల బాలాజీ స్నానఘట్టం వద్ద దాత సహకారం తో నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దాత మురమళ్ళ వాసులు చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, యాత్రికులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.



బాల బాలాజీ స్నాన ఘట్టం వద్ద ఆవిష్కరించిన గరుడ విగ్రహం

అరటి తోటలు ధ్వంసం చేస్తున్న పందులు

ప్రజాశక్తి -అంబాజీపేట

మండలంలో రైతులు సాగు చేస్తున్న అరటి పంటలను పందులు ధ్వంసం చేస్తున్నాయి. మాచవరం, వాకలగరువు, తొండవరం, నందంపూడి తదితర గ్రామాలకు అరటి మార్కెట్ అందుబాటులో ఉండడంతో రైతులు అరటి పంట సాగు చేస్తున్నారు. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి వేరే ప్రాంతాల నుంచి అరటి దుంపలు తెచ్చి సాగు చేపట్టారు. పిలకలు వేసే సమయంలో మొలకలు లేతగా ఉన్న సమయంలో పందులు వచ్చి పంటలు ధ్వంసం చేస్తున్నాయి. ఈ విషయమై రైతులు పలు సార్లు పంచాయతీ కార్యదర్శులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పందుల పెంపకం దారులు, రైతులతో కలసి సమావేశమై పందులను బయటకు వదలకుండా జాగ్రత్తలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. హామీ విస్మరించి రాత్రి సమయాల్లో పందులను వదిలివేస్తుండడంతో అరటి తోటలు ధ్వంసం చేస్తున్నాయి. పందుల పెంపకం దారులు ఫార్మ్ ఏర్పాటు చేసుకుని బయటకు వదలకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పందులు ధ్వంసంచేసిన అరటి తోట

సగం పంట నష్టపోయాను



మాచవరం డైలీ మార్కెట్ సమీపం పొలంలో ఎకరానికి రూ.50 వేలు పెట్టు బడి పెట్టి మూడు ఎకరాలు అరటి పంట సాగు చేశాం.. మొత్తం రూ.లక్ష 50 వేలు పెట్టుబడి పెట్టగా పందులు సుమారు 60 నుంచి 65 అరటి చెట్లు ధ్వంసం చేశాయి. సుమారు రూ.30 వేల వరకూ పంట నష్ట పోయాం. ఇలా కొనసాగితే ఈ ప్రాంత రైతులు అరటిపంట సాగుకు విరామం ప్రకటించ

-కొలిశెట్టి భాను ప్రసాద్, అరటి రైతు, మాచవరం

మున్సిపల్ డిఇఇ సస్పెన్షన్

ప్రజాశక్తి - పిఠాపురం

పురపాక సంఘం డిఇఇ ఎస్.భవానీ శంకర్‌ను సస్పెండ్ చేస్తూ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, డిఇఇ భవాని శంకర్‌లు ఒకరినొకరుపై ఆరోపణలు చేసుకుంటూ వ్యక్తిగతంగా దూషించుకున్నారు. ఈ సంఘటనపై మున్సిపల్ ఆర్‌డి నరసింహారావు, కాకినాడ ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. నివేదికను ఆధారంగా చేసుకుని డిఇఇని సస్పెండ్ చేయాలని కలెక్టర్ సిపార్సు చేశారు. ఈ నేపథ్యంలో భవాని శంకర్‌ను సస్పెండ్ చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ గోపాల కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.